## క్లుప్తంగా

### దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ అందజేత



దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు అర్బన్:** ఒంగోలు నగరానికి చెందిన షేక్ బాషా అనే దివ్యాంగుడికి కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా సోమవారం మూడు చక్రాల సైకిల్ అందజేశారు. తనకు మూడు చక్రాల సైకిల్ ఇవ్వాలని గ్రీవెన్స్‌లో దివ్యాంగుడు కోరడంతో స్పందించిన కలెక్టర్.. వెంటనే దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీతో మాట్లాడారు. దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ అందించాలని ఆదేశించారు. ఆ మేరకు దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన మూడు చక్రాల సైకిల్ ఏర్పాటు చేయగా, స్థానిక ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలు వద్ద కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారుడికి అందజేశారు.

### ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతగా నిలిచిన క్రికెట్ జట్టు

**చీమకుర్తి:** రెండు రోజుల నుంచి చీమకుర్తి భాష్యం పబ్లిక్ స్కూల్ ఆవరణలో జరుగుతున్న క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో పూల్ ఏలో శివాజీనగర్ జట్టు, పూల్ బీలో టంగుటూరు బ్రాంచ్ క్రికెట్ జట్టు ఫైనల్‌కు చేరాయి. ఆ రెండు జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శివాజీనగర్ జట్టు విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు చేతుల మీదుగా మెమెంటోలు అందించారు.

### దివ్యాంగుడి జీవనోపాధికి చేయూత



బడ్డీ కొట్టు వద్ద శ్రీనివాసరావుతో ట్రస్ట్ నిర్వాహకులు


**ఒంగోలు సిటీ:** రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన దివ్యాంగుడు గొల్లపూడి శ్రీనివాసరావు జీవనోపాధికి సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. గొల్లపూడి శ్రీనివాసరావు పెద్ద కుమారుడు రెండేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించాడు. అప్పటి నుంచి జీవనోపాధికి ఇబ్బందిపడుతుండగా, ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్‌బాషా దాత, ప్రవాస భారతీయుడు సుమంత్ సాయంతో రూ.38 వేలతో బడ్డీ కొట్టు ఏర్పాటు చేయించారు. ట్రస్ట్ నిర్వాహకులు, దాతలకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మహా పడి భజన



పూజలు చేస్తున్న శిద్దా కుటుంబ సభ్యులు

**ఒంగోలు మెట్రో:** అయ్యప్పస్వామి మహా పడి భజనను మాజీ మంత్రి శిద్దా రాఘవరావు నివాసంలో సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, శిద్దా సుధీర్ దంపతులు, మన్యం ఫణి కుమార్ దంపతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై అయ్యప్పస్వామి, శివ పార్వతులు, సుబ్రహ్మణ్యస్వామి, వినాయకుడు, కనకదుర్గాదేవికి విశేష పూజలు, అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు మాలలు ధరించిన దీక్షాస్వాములు భారీగా పాల్గొని భజనలు చేశారు. దేవత వేషధారణలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. శిద్దా కుటుంబ సభ్యులు, కరణం బలరాం, అగ్రికల్చర్ మిషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ సుశీల, పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



పడి పూజలో భారీగా పాల్గొన్న మాలధారులు

# హౌసింగ్ బోర్డు పార్కుకు గ్రహణం



పనులు పూర్తవక గేటు మూసి వేసి ఉన్న హౌసింగ్ బోర్డు పార్కు



వినియోగంలోకి రాని ఓపెన్ జిమ్

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.75 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు
- మరో రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్
- కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా నిలిచిపోయిన పనులు
- గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు కూడా వృథా అయ్యే ప్రమాదం





పార్కులో అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు

**ఒంగోలు అర్బన్:** కూటమి ప్రభుత్వం వచ్చాక ఒంగోలు నగరంలోని హౌసింగ్ బోర్డుకాలనీలో నిర్మిస్తున్న పార్కుకు గ్రహణం పట్టింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులు కేటాయించి దాదాపు 70 శాతానికిపైగా పార్కు పనులు పూర్తి చేయగా, మిగిలిన పనులు పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. స్థానిక ప్రజలు నడిచేందుకు వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లలు ఆడుకునేందుకు పరికరాలు, పెద్దలు వ్యాయామంతో పాటు సాయంత్రం కాసేపు ఆహ్లాదంగా గడిపేందుకు అవసరమైన పనులతో గత ప్రభుత్వంలో హౌసింగ్ బోర్డులోని పార్కు అభివృద్ధికి నగరపాలక సంస్థ ద్వారా శ్రీకారం చుట్టారు. పార్కు అభివృద్ధికి ఆర్థిక సంఘం నిధులు రూ.75 లక్షలు కేటాయించారు. అదేవిధంగా సాధారణ నిధుల నుంచి మరో రూ.10 లక్షలు ఓపెన్ జిమ్‌కు కేటాయించారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పూర్తయింది. దాంతో పాటు వాకింగ్ ట్రాక్, ప్లాంటేషన్, వంటి పనులకు ప్లాన్ వేసి కొంతమేర పూర్తి చేశారు. లాన్ పనులు జరగాల్సి ఉన్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా నేటికీ పనులు ప్రారంభించలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే దాదాపుగా 70 శాతానికిపైగా పార్కు అభివృద్ధి పనులు పూర్తయినప్పటికీ.. మిగిలిన 30 శాతం పనులు పూర్తి చేసి పార్కును ప్రారంభించకుండా కూటమి పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలల తరబడి జాప్యం చేస్తుండటంతో స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ఉంటే ఈ పాటికి పార్కు పూర్తయి వినియోగంలోకి వచ్చి ఉండేదని మాట్లాడుకుంటున్నారు. కేవలం ప్రభుత్వం మారడం వలనే పార్కు పనులు నత్తనడకన సాగుతున్నాయంటూ కూటమి పాలనపై హౌసింగ్‌బోర్డు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగరపాలకసంస్థ అధికారులు మాత్రం మరో రెండుమూడు నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెబుతున్నారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలన్నీ నిలిచిపోవడంతో.. హౌసింగ్‌బోర్డు పార్కు పనులు ఇప్పట్లో పూర్తయ్యే దాఖలాలు కూడా కనిపించడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఇప్పటికే పూర్తి చేసిన పార్కు అభివృద్ధి పనులు కూడా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుని ప్రజాధనం వృథా అయ్యే ప్రమాదం ఉంది. అలా జరగకముందే పెండింగ్ పనులు పూర్తిచేసి పార్కును ప్రారంభించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## బీజామృతంతో విత్తనశుద్ధి ద్వారా అనేక ప్రయోజనాలు



విత్తనాలకు బీజామృతంతో శుద్ధి చేస్తున్న రాధా సింగమనేని, తదితరులు

**ఒంగోలు సిటీ:** బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ రాధా సింగమనేని తెలిపారు. సోమవారం ఒంగోలు మండలంలోని ఉలిచి గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో డీపీఎం యు.సుభాషిణి నేతృత్వంలో అన్ని రకాల విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేశారు. దీని ద్వారా భూమి నుంచి వచ్చే వ్యాధులను తగ్గించవచ్చని రాధా తెలిపారు. మొలక శాతం కూడా మెరుగుపడుతుందన్నారు. తద్వారా పంట దిగుబడి పెరుగుతుందన్నారు. వివిధ రకాల విత్తనాల వాడకం ద్వారా భూమిలో సూక్ష్మజీవుల ఆవాసం పెరుగుతుందని, ఇది భూమి సారానికి మేలు చేస్తుందని అన్నారు. పంట నాణ్యత మెరుగవ్వడంతో పాటు చీడపీడలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ప్రకృతి అనుకూల పద్ధతులపై అవగాహన కలిగించి భవిష్యత్తులో రైతు సాధికారితకు దోహదం చేయనున్నట్లు చెప్పారు.

# కనకదుర్గమ్మకు పడి పూజ



అమ్మవారి జ్యోతులతో మహిళా భక్తులు

**ఒంగోలు మెట్రో:** స్థానిక మంగమూరురోడ్డు మిలటరీకాలనీ, యానాది సంఘం కాలనీలో వేంచేసియున్న పోలేరమ్మ, కనకదుర్గమ్మ దేవస్థానంలో ధర్మకర్తలు నాగూర్ నాగూర్బి దంపతుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో సోమవారం రాత్రి కనకదుర్గమ్మకు పడి పూజ నిర్వహించారు. స్థానిక మహిళా భక్తులు దీక్షాధారులతో 108 అఖండ జ్యోతులతో మర్రిచెట్టుకాలనీ అభయాంజనేయ స్వామి దేవస్థానం వరకు వైభవంగా నగరోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా 33వ డివిజన్ కార్పొరేటర్ నియంతదేవి పెద్దిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి దంపతులు పాల్గొని పోలేరమ్మ, కనకదుర్గమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కనకదుర్గాదేవి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పడి పూజ చేశారు. స్థానిక భక్తులు, అయ్యప్ప, శివ, గోవింద మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు, అల్పాహారం స్వీకరించారు.

# శ్రీకృష్ణుడిని పొందేందుకే గోదాదేవి ఆవిర్భావం



గీతా మందిరంలో తిరుప్పావై ప్రవచనంలో పొన్నూరు శ్రీనివాసులు



అనంత కోదండరామస్వామి మందిరంలో తిరుప్పావై ప్రవచనంలో శ్రీనివాసచక్రవర్తి, భక్తులు

**ఒంగోలు మెట్రో:** గోదాదేవి రచించిన పాశురాలు సమస్త వేదసారమని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు, ఆళ్వార్‌దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు గాంధీ రోడ్డులోని గీతామందిరంలో సోమవారం తిరుప్పావై ప్రవచనాలు ప్రారంభించారు. టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు మాట్లాడుతూ గోదాదేవి ఆవిర్భావం, శ్రీకృష్ణుడిని పొందేందుకు ఆండాళ్ గోష్టి ఆచరించిన తిరుప్పావై వ్రతం, పాశురాల ప్రాశస్త్యాన్ని వివరించారు. మొట్టమొదటి పాశురంలోని అంతరార్థాలను తన ఉపన్యాసం ద్వారా తెలిపారు. తిరుప్పావై పాశురాల పారాయణం, ప్రవచనం వినడం వలన అనన్య శేషత్వం, అనన్య భోగత్వం, అనన్య శరణత్వం లభిస్తాయని తెలిపారు. ముందుగా పొన్నూరును గీతామందిరం భక్త బృంద సభ్యులు కృష్ణ, సురేఖ, మువ్వల సుబ్బారావు, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, అనిత, రాధ, సీత, శ్రీదేవి, చల్లా నాగేశ్వరమ్మ తదితరులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**అనంత కోదండరామస్వామి మందిరంలో ధనుర్మాస ఉత్సవాలు...**

ఒంగోలులోని ఘడియారంవారివీధిలో గల అనంత కోదండరామస్వామి మందిరంలో వంశపారంపర్య ధర్మకర్తలు ఘడియారం సుబ్బయ్యశర్మ ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ నాలాయిర్ దివ్య ప్రబంధ అధ్యాపకులు శ్రీమాన్ భాగవతుల శ్రీనివాస చక్రవర్తి తిరుప్పావై పారాయణ ప్రవచనం, ప్రాతఃకాలమున గోదాదేవి పాశురాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా పూజలు



చీమకుర్తి హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

**చీమకుర్తి రూరల్:** మండలంలోని అగ్రహారం గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శిద్దా భరత్, ప్రవళిక దంపతులు, పంచాంగం రామానుజాచార్యులు, ఆలయ ధర్మకర్త కాండూరి రవిరామానుజాచార్యులు, ఆలయ అర్చకుడు వెంకట రామాచార్యులు, కార్యదర్శి కోటా బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**హరిహరక్షేత్రంలో...**

**చీమకుర్తి:** ధనుర్మాస వ్రత వేడుకలు చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో 108 వెండి గంగాళాలతో వేదపండితుల ద్వారా అలంకరించి పూజలు చేశారు. ప్రాతఃకాలంలో గోదాదేవి సమేత రంగనాథస్వామికి తిరుప్పావై పారాయణం, గోపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు వెండి గంగాళాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ నిర్వాహకులతో పాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## జేఎంబీ చర్చిలో క్రిస్మస్ గీతాలు

**ఒంగోలు మెట్రో:** క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి ఒంగోలులోని జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ (జేఎంబీ) చర్చి ఆవరణలో బైక్స్ అండ్ ఇంగ్లిష్ సర్వీస్ వారు ఘనంగా వేడుకలు నిర్వహించారు. బైక్స్ డైరెక్టర్లు ఎం.వీణామాధురి, ఎం.ప్రమోద్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేడుకల్లో పాస్టర్లు పాల్, డీజే అగస్టీన్ క్రిస్మస్ సందేశం అందించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి బైక్స్ యువతీ యువకులు క్రిస్మస్ గీతాలకు నృత్యాలు చేశారు. అనంతరం క్రీస్తు పుట్టుక నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి తెలగతోటి సుమతి, ట్రెజరర్ తాడిపర్తి పవిత్రన్ పాల్గొన్నారు.



క్రిస్మస్ గీతాలు ఆలపిస్తున్న బైక్స్ బృందం

## బౌద్ధ ధర్మమే సర్వమానవ సంక్షేమ మార్గం



ప్రచార యాత్రలో పాల్గొన్న నాయకులు

**ఒంగోలు వన్‌టౌన్:** బౌద్ధ ధర్మమే సర్వమానవ సంక్షేమ మార్గమని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ సుధాకర్‌బాబు అన్నారు. మార్గశిర పౌర్ణమి సందర్భంగా ఒంగోలు బౌద్ధ ధర్మ ప్రచార సమితి నిర్వహించిన ప్రచార యాత్రలో సోమవారం ఆయన పాల్గొన్నారు. కె.రాఘవరావు పాల్గొని మాట్లాడుతూ మానవులంతా సమానమేనని, ఒకరినొకరు దోచుకోకూడదని అన్నారు. బౌద్ధ ధర్మాన్ని ప్రపంచ దేశాలు ఆచరించి ప్రగతి సాధిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా భారతీయులు బౌద్ధ ధర్మాన్ని ఆచరించి దేశ సమగ్రత, అభివృద్ధికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఓపీడీఆర్ రాష్ట్ర నాయకుడు సుధాకర్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను బౌద్ధం నుంచే స్వీకరించారని, అశోక ధర్మ చక్రం, మూడు సింహాలు, సత్యమేవ జయతే మొదలగు అంశాలు, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటివి బౌద్ధ ధర్మ మూలాలని అన్నారు. ఈ సందర్భంగా బౌద్ధ ధర్మ ప్రచార యాత్రను ప్రకాశం భవన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బుద్ధ వందనం, పంచశీల ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. బుద్ధిస్టులు, బీసీ సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వాసవీ క్లబ్‌లకు బెస్ట్ అవార్డుల పంపిణీ



అవార్డులు అందజేస్తున్న పారిశ్రామికవేత్త శిద్దా హనుమంతరావు


**సంతనూతలపాడు:** తమిళనాడు రాష్ట్రం మధురైలో ఆదివారం జరిగిన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో 2024 సంవత్సరంలో సంతనూతలపాడు వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్‌లు అందించిన సేవలకుగానూ బెస్ట్ అవార్డులు అందజేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కొంజేటి వెంకట సురేష్‌బాబు, గవర్నర్ పేర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త, వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శిద్దా సూర్యప్రకాశరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వేమూరి వెంకట శేషారావు, వాసవీ మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతిలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సెక్రటరీ సీహెచ్ రాము, కోశాధికారి పి.సుధాకర్, వాసవీ మహిళా క్లబ్ సెక్రటరీ శిఖాకొల్లి జయశ్రీ, కోశాధికారి జి.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న వారిని వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధులు వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు, జీఎల్ ప్రసాదరావు, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు జి.శరత్‌బాబు, జిల్లా ఆర్యవైశ్య సంఘ జాయింట్ సెక్రటరీ చక్కా సుబ్బరాయుడు, వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు చలువాది శ్రీనివాసరావు, పి.గిరి, జి.బద్రీనారాయణ తదితరులు అభినందించారు.

## 20న ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని దుకాణం స్వాధీనం

**ఒంగోలు వన్‌టౌన్:** ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఒంగోలు ఏబీఎం కళాశాల ఎదురుగా ఉన్న దుకాణ సముదాయంలోని 10వ నంబర్ దుకాణాన్ని ఈ నెల 20వ తేదీ స్వాధీనం చేసుకోనున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకారం సంఘ లిమిటెడ్ కార్యాలయ ప్రతినిధి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణం అద్దెను చాలా సంవత్సరాల నుంచి లబ్ధిదారుడు చెల్లించడంలేదని, ఇటీవల మరణించాడని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన గత ఉత్తర్వులు, రూల్స్‌ను అనుసరించి వచ్చే శుక్రవారం ఉదయం 11 గంటలకు దుకాణంకు పంచనామా జరిపి స్వాధీనం చేసుకోనున్నట్లు వెల్లడించారు.



# గ్రామాల అభివృద్ధికి నడుం బిగిద్దాం



మద్దిపాడులో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి



సంతనూతలపాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష‌బాబు

**సంతనూతలపాడు:** సర్పంచులు, కార్యదర్శులు ఐక్యంగా గ్రామాల అభివృద్ధికి నడుం బిగించాలని ఎంపీడీఓ సురేష్‌బాబు సూచించారు. ఈ నెల 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు వారికి ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల సందర్భంగా సోమవారం తొలుత బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ చిత్ర పటాలకు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీడీవో డి.సురేష్ బాబు, ఈఓపీఆర్డీ ఎం.రమణమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసంగిస్తూ గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రభుత్వం, పంచాయతీల జనరల్ ఫండ్ ద్వారా భావితరాలకు ఉపయోగపడే రీతిలో అభివృద్ధికి పాటుపడాలని కోరారు. గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఐసీడీఎస్, పంచాయతీరాజ్, తదితర శాఖలపై రిసోర్స్ పర్సన్లు, ఈఓపీఆర్డీ ఎం.రమణమ్మ, మైనంపాడు పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రొజెక్టర్ ద్వారా పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు బలరామిరెడ్డి, పుష్ప, విజయలక్ష్మి, మల్లయ్య, బొడ్డు రామారావు, ఎస్.పుల్లయ్య, బి.కోమలి, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎనర్జీ అసిస్టెంట్లు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

**మద్దిపాడులో...**

**మద్దిపాడు:** సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై సోమవారం మొదటిరోజు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో వి.జ్యోతి, ఎంపీపీ వాకా అరుణా కోటిరెడ్డి, ఈఓపీఆర్డీ కె.రఘుబాబు పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో నిర్వహించాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ప్రభుత్వం, పంచాయతీల జనరల్ ఫండ్ ద్వారా భావితరాలకు ఉపయోగపడేలా పూర్తిచేయాలని వారు కోరారు. అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. వైద్యశాఖ, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, తదితర శాఖలపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ తరగతులు నిర్వహించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసులు, ఎనర్జీ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు. శిక్షణ తరగతులు నాలుగు రోజుల పాటు జరగనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.